క్లుప్తంగా

నేడు హుస్నాబాద్‌లో అభివృద్ధిపై మంత్రి సమీక్ష

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధి పనుల పై ఆదివారం ఉదయం 8 గంటలకు ఐఓసీ కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రవీందర్‌రెడ్డి శనివారం తెలిపారు. ఆరు మండలాల్లోని వివిధ శాఖల ప్రగతి నివేదికలను పరిశీలించి వేసవిలో దాహార్తి తీర్చడానికి చేపట్టే పనుల పై చర్చించనున్నారు. అధికారులు మండలాల వారీగా ప్రగతి నివేదికలను సిద్ధం చేసుకున్నారు. సమావేశ ఏర్పాట్లను ఆర్డీవో రామ్మూర్తి పరిశీలించారు.

దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

అక్కన్నపేట(హుస్నాబాద్): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ బానోతు జయరాం అన్నారు. మండలంలోని కట్కూర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక బస్‌షెల్టర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నీరు జీవకోటికి ప్రాణాధారం..నీటిని వృథా చేయవద్దన్నారు. మండలంలోని 30 గ్రామాల్లో పంచాయతీల ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ రాజయ్య, వైస్ చైర్మన్ ముకుందంరెడ్డి, మాజీ సర్పంచ్ రాజునాయక్, నాయకులు బాలరాజు, పంచాయతీ కార్యదర్శి స్వరూప, మహిళా సంఘం సీఏ పద్మ, అంగన్‌వాడీ టీచర్, ఏఎన్‌ఎంలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శాలివాహన చక్రవర్తి జయంతి


శాలివాహన మహారాజు ఫ్లెక్సీకి పూలమాల వేస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శాతవాహన వంశానికి మూల పురుషుడు శాతవాహనుడు అని కుమ్మరి సంఘం రాష్ట్ర నాయకుడు దరిపల్లి చంద్రం అన్నారు. శనివారం సిద్దిపేట పట్టణంలో బీజేఆర్ జంక్షన్‌లో జిల్లా కుమ్మరి సంఘం అసోసియేట్ అధ్యక్షుడు తరిగొప్పుల రామచంద్రం ఆధ్వర్యంలో శాలివాహన చక్రవర్తి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మౌర్య సామ్రాజ్యం పతనానంతరం, స్వతంత్ర రాజుగా ప్రకటించుకొని శాతవాహన వంశానికి ఆద్యుడయ్యాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాదారి నాగరాజు, పిడిశెట్టి రాజు, దర్పల్లి భూమయ్య, రాజలింగం పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చేర్యాల(సిద్దిపేట): ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించి, పెండింగ్ వేతనాలు చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొంగరి వెంకట్ మావో డిమాండ్ చేశారు. శనివారం అర్హులైన పేదలకు ఇండ్లు, స్థలాలు, రేషన్ కార్డులు, పెన్షన్లు, భూమిలేని ఉపాధి కూలీల కుటుంబాలకు రూ.12వేలు చొప్పున ఆత్మీయ భరోసా అందించాలని కోరుతూ స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి మల్లేశం, అధ్యక్షుడు రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

మట్టి ట్రాక్టర్లు పట్టివేత

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం గాంధీనగర్ నుంచి అక్రమంగా ఇటుక బట్టీలకు నల్ల మట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు శనివారం పట్టుకున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టి, ఇసుక రవాణా చేయరాదని గతంలోనే హెచ్చరించారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు మూడు ట్రాక్టర్లను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యాజమానులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయనున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

నేత్రపర్వం.. మూల మహోత్సవం


విశేషాలంకరణలో సరస్వతీదేవి


లక్ష పుష్పార్చనలో పాల్గొన్న భక్తులు

చదువుల తల్లి వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో శనివారం మూల మహోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖర సిద్ధాంతి పర్యవేక్షణలో అర్చకులు తెల్లవారుజామున గణపతిపూజ, అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు జరిపించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి సామూహిక లక్షపుష్పార్చన, చండీ హోమం నిర్వహించినట్లు తెలిపారు.

– వర్గల్(గజ్వేల్)

హంస వాహనంపై నృసింహుడి వైభవం

ఘనంగా నాచగిరి బ్రహ్మోత్సవాలు

వర్గల్(గజ్వేల్): నాచారం గుట్ట నాచగిరి లక్ష్మీనృసింహ క్షేత్రంలో శ్రీవారి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శనివారం రాత్రి హంసవాహన సేవ నేత్రపర్వంగా జరిగింది. పూలమాలికలు, పట్టువస్త్రాలతో విశేషాలంకృతమైన హంస వాహనాన్ని శ్రీలక్ష్మీ సమేతులై నృసింహస్వామి వారు అధిష్ఠించారు. భక్తజన హర్షధ్వానాల మధ్య పురవీధుల గుండా ఊరేగుతూ సభా మండపానికి వేంచేశారు. అక్కడ పలు కార్యక్రమాల అనంతరం స్వామివారు గర్భగుడికి చేరుకున్నారు. హంస వాహన సేవ ఊరేగింపులో పుర ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారి గజవాహన సేవ జరుగుతుందని ఆలయ ఈఓ విశ్వనాథశర్మ తెలిపారు.


హంసవాహనంపై నాచగిరి స్వామివారు

జీవకోటికి నీరే ప్రాణాధారం

జిల్లా వ్యాప్తంగా ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని పలు స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ పాఠశాలల్లో, మండల కేంద్రాలు, గ్రామాల్లో నీటి పొదుపు పై అవగాహన కల్పించి, ర్యాలీలు, మానవహారం నిర్వహించారు. ప్రతి నీటి బొట్టును పొదుపుగా వాడుకోవాలని, వర్షపునీరును ఒడిసి పట్టుకొని ఇంకుడు గుంతలోకి మళ్లించాలన్నారు. దీంతో భూగర్భజలాలు పెరుగుతాయని సూచించారు. జీవకోటికి నీరే ప్రాణాధారమని, నీరు లేకపోతే బతకడం కష్టమని పేర్కొన్నారు.


మద్దూరు(హుస్నాబాద్): నీటి ప్రాముఖ్యత పై నినాదాలు చేస్తున్న గ్రామస్తులు



చిన్నకోడూరు(సిద్దిపేట): రామునిపట్లలో విద్యార్థుల ర్యాలీ



దుబ్బాకరూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న బాలవికాస స్వచ్ఛంద సంస్థ సభ్యులు

నర్సారెడ్డికి ఘన స్వాగతం

వర్గల్(గజ్వేల్): కేసీఆర్ తీరును ఎండగడుతూ కాంగ్రెస్ శ్రేణులతో కలిసి డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి కలెక్టరేట్ నుంచి రాజ్‌భవన్‌కు చేపట్టిన పాదయాత్ర శనివారం వర్గల్ మండలం గౌరారం చేరుకున్నది. ఈ సందర్భంగా ఆయనకు మండల కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. పోరుబాట పాదయాత్రలో నాయకులు రంజిత్‌రెడ్డి, ప్రవీణ్, భానుప్రసాద్‌గౌడ్, వెంకటేశం, నర్సింహులు గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నర్సారెడ్డికి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ శ్రేణులు

నర్సారెడ్డిని విమర్శిస్తే సహించేదిలేదు

గజ్వేల్: డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డిని విమర్శిస్తే సహించేదిలేదని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నేత ప్రతాప్‌రెడ్డి తీరుపై మండిపడ్డారు. ప్రజలకు మాజీ సీఎం అందుబాటులో ఉండటం లేదని, ఇదే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి నర్సారెడ్డి పాదయాత్ర చేస్తే ప్రతాప్‌రెడ్డికి ఉలుకెందుకని ప్రశ్నించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, కుకునూర్‌పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సుభేందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, వహీద్, శీను, రాములు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

దుబ్బాకటౌన్: విద్యార్థులను దేశాభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహిస్తోందని దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భవానీ అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. వికసిత్ భారత్ జిల్లా స్థాయి పోటీల్లో ఒకే దేశం ఒకే ఎన్నిక అనే అంశం పై బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న భార్గవి, మనూష ప్రసంగించి ప్రతిభ కనబర్చారని తెలిపారు. విద్యార్థుల నైపుణ్యాలు పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని కొనియాడారు.


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ భవాని




రైతు ఆలోచన భళా..

సాధారణంగా రైతులు తమ పొలానికి ఎలాంటి దిష్టి తగలకుండా ఉండేందుకు దిష్టి బొమ్మలను పెట్టడం మనం చూస్తుంటాం. కానీ చిన్నకోడూర్ మండల పరిధిలోని చంద్లాపూర్ గ్రామ శివారులో ఓ రైతు ఇలా వినూత్నంగా ఆలోచించాడు. తన పంటపై ఎవరి దిష్టి పడకుండా మోడల్, దిష్టి బొమ్మలను ఏర్పాటు చేశారు. దీని చూసిన వారు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

కాళేశ్వరంతో సాగు కష్టాలు దూరం

రామగుండం మాజీ ఎమ్మెల్యే చందర్

మర్కూక్(గజ్వేల్): కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనే సంకల్పంతో నిర్మించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని రామగుండం మాజీ ఎమ్మెల్యే చందర్ అన్నారు. గోదావరి కన్నీటి గోస పేరుతో చేపట్టిన పాదయాత్ర శనివారం సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని మాజీ సీఎం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయనకు గణేశ్‌పల్లి వద్ద ఎఫ్‌డీసీ మాజీ చేర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో పంటలు ఎండిపోయి రైతులు అరి గోస పడుతున్నారని చెప్పారు. గత పదేండ్లలో గోదావరి నిండుకుండలా ప్రవహించిందని, ఇప్పుడు సుక్క నీరు లేక ఎడారిని తలపిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు రాంచంద్రం, పాండుగౌడ్, బాల్‌రెడ్డి, కృష్ణ యాదవ్, కనకయ్య పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చందర్

మహిళా రైతులకు సబ్సిడీపై పనిముట్లు

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు, దూల్మిట్ట మండలాల్లో మహిళలందరికి వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ఎస్‌ఎంఏఎం పథకం నుంచి రాయితీ పై పనిముట్లు ఇవ్వనున్నట్లు మండల వ్యవసాయ అధికారులు రామకృష్ణ, అఫ్రోజ్ తెలిపారు. మహిళా రైతులకు 50 శాతం రాయితీతో వ్యవసాయ పనిముట్లను ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. ఆసక్తి గల మహిళా రైతులు భూమి పాస్‌బుక్, ఆధార్‌కార్డు, ట్రాక్టర్ ఆర్సీ పత్రాలతో వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

గ్రామ సచివాలయాన్ని సందర్శించిన విద్యార్థులు



అక్కన్నపేట(హుస్నాబాద్): మండల పరిధిలోని అంతక్కపేటలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న మూడవ తరగతి విద్యార్థులు శనివారం గ్రామ సచివాలయం, తపాలా కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్‌నాయక్ మాట్లాడుతూ గ్రామంలో పరిపాలన ఎలా జరుగుతుందో తెలుసుకోవడానికి సందర్శించామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ జనాభా ఎంత? తాగునీటిని ఎలా అందిస్తారు? మురుగు నీటి కాలువలను ఎవరు శుభ్రం చేస్తారు? పోస్ట్ ఆఫీస్‌లో ఎలాంటి స్కీమ్స్ అందిస్తున్నారు? అమ్మాయిలకు ప్రత్యేకంగా ఏదైనా స్కీమ్ ఉందా? తదితర ప్రశ్నలు అడిగి సమాచారం తెలుసుకొని వివరాలను నమోదు చేసుకున్నారు.

తల్లిదండ్రులను పోషించకుంటే చర్యలు

సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను

సిద్దిపేటకమాన్: తల్లిదండ్రులను, వయోవృద్ధులను పోషించకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను తెలిపారు. పట్టణ పోలీసు కమిషనర్ కార్యాలయంలో రాష్ట్ర ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధుల రక్షణకు ఉన్న చట్టాలకు సంబంధించిన ఫ్లెక్సీలను సీఐ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులను పోషించాల్సిన బాధ్యత పిల్లలపై ఉందని, చూడకపోతే పీఎస్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. వారి పిల్లలను పిలిపించి కౌన్సిలింగ్ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ అపూర్వరెడ్డి, చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ, అధికారులు, పలువురు సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.


ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న రూరల్ సీఐ శ్రీను

ఆలయ భూమిని పరిరక్షించండి

– పద్మశాలి సంఘం నాయకులు

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని శివ భక్త మార్కండేయ దేవాలయం పక్కన ఉన్న 33 అడుగుల రహదారిని సయ్యద్ రఫీ ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నాడని పద్మశాలి సేవా సంఘం పట్టణ, మండల అధ్యక్షుడు కోమటి సత్యనారాయణ, బూర్ల రాజయ్యలు ఆరోపించారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలోనే ఎల్లమ్మ దేవాలయం భూమికి సంబంధించిన హద్దులు నిర్ణయించి దిమ్మెల నిర్మాణం జరిగిందన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు నారాయణ, బాలయ్య, ఆత్మలింగం, లక్ష్మిపతి, శివరాజం, రాజేశం ఉన్నారు.

కబడ్డీ పోటీల బ్రోచర్ ఆవిష్కరణ

వచ్చే నెల 11 నుంచి పోటీలు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో అంబేద్కర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 11 నుంచి 13 వరకు జిల్లా స్థాయి కబడ్డీ చాంపియన్ షిప్ ట్రోఫీని నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కబడ్డీ పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా పురుషుల విభాగంలో జిల్లా స్థాయిలో, మహిళల విభాగంలో రాష్ట్రస్థాయిలో ఈ టోర్నమెంట్ ఉంటుందన్నారు. కాగా 500 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు జగదీశ్వర్‌యాదవ్, వీరేశ్, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాధవి, మల్లేశ్, కురుమూర్తి, అబ్దుల్‌ఖాన్, లక్ష్మణ్, నవీన్, ప్రవీణ్, కుమార్ పాల్గొన్నారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

సంక్షిప్త వార్తలు

◆ **అభివృద్ధి పనులు ప్రారంభం**

తొగుట(దుబ్బాక): మండలంలోని పలు గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా మంజూరైన నిధులతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. వెంకట్రావుపేటలో శనివారం సీసీ రోడ్ల నిర్మాణ పనులను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి ప్రారంభించారు.

◆ **ప్రభుత్వ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే**

నంగనూరు(సిద్దిపేట): మండల పరిధిలోని బద్దీపడగ మండల ప్రజా పరిషత్ పాఠశాలలో శనివారం స్కిల్ ఇన్ విలేజ్ దేశ్‌పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. విద్యార్థులు ఆంగ్లంలో పట్టు కోసం ఫౌండేషన్ స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహించింది.వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు రవళి పాల్గొన్నారు.

◆ **బాలుడికి ఎల్వోసీ అందజేత**

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని నర్సాయపల్లి గ్రామానికి చెందిన మంతెన బాల్‌రెడ్డి మనుమడు నిమ్మ మన్విత్ వినికిడి సమస్యతో బాధపడుతున్నాడు. వినికిడి యంత్రం వాడితే సమస్య తీరుతుందని వైద్యులు చెప్పడంతో మద్దూరు మాజీ ఎంపీపీ కృష్ణారెడ్డి ద్వారా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన సీఎంఆర్‌ఎఫ్ ఫండ్ నుంచి రూ.7లక్షల ఎల్వోసీని మంజూరు చేయించారు. ఈ సందర్భంగా వారికి మన్విత్ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

◆ **ఆన్‌లైన్‌లో జాతీయ సదస్సు**

సిద్దిపేట ఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో బాటనీ విభాగాధిపతి, వెబ్‌నార్ కన్వీనర్ డాక్టర్ కొమ్మిడి రాణి ఆధ్వర్యంలో శనివారం ఆన్‌లైన్‌లో జాతీయ సదస్సు నిర్వహించారు. ప్రపంచ వాటర్, ఫారెస్ట్ డే సందర్భంగా పర్యావరణ సుస్థిరత, ఆహారభద్రత అనే అంశంపై వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ బయోడైవర్సిటీని కాపాడుకునేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. అంతరించి పోతున్న జీవులు, అడవులు, వాటి ప్రాధాన్యత గూర్చి వివరించారు. బాటనీ అధ్యాపకుడు డాక్టర్ తిరుపతి, ఆర్‌జేడీ డాక్టర్ రాజేందర్‌సింగ్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడ్డి, సీఓఈ డాక్టర్ సుదర్శనం, అధ్యాపకులు ఫాతిమా పాల్గొన్నారు.

◆ **అవినీతి అధికారి పై చర్యలు తీసుకోవాలి**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎస్సీశాఖలో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న అధికారి పై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అభిషేక్ భాను, రంజిత్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న హాస్టళ్లలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తూ సుమారుగా రూ.60 నుంచి రూ.70 వేల దాకా డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపించారు. కలెక్టర్ విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు భరత్ కుమార్, కోనేరు ప్రవీణ్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి సంతోష్ పాల్గొన్నారు.

◆ **కోళ్ల ఫారాలపై చర్యలు తీసుకోవాలి**

దుబ్బాకరూరల్: గ్రామానికి సమీపంలో ఉన్న కోళ్ల ఫారాలపై చర్యలు తీసుకోవాలని పద్మశాలిగడ్డ మధిరగ్రామం నర్లెంగడ్డ ప్రజలు శనివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు యాదగిరి, రాజు, రవి మాట్లాడుతూ గ్రామానికి ఆనుకుని ఉన్న ఫారాల్లో చనిపోయిన కోళ్లను శివారులో పడవేయడంతో దుర్వాసన వస్తుందన్నారు. వాటిని కుక్కలు తింటున్నాయని, ఇండ్లలోకి తీసుకొస్తున్నాయని తెలిపారు. చనిపోయిన కోళ్లను మల్లన్న సాగర్ ద్వారా వచ్చే కెనాల్‌లో పడవేయడంతో నీల్లు కలుషితం అవుతున్నాయని ఆరోపించారు. అధికారులు స్పందించి పౌల్ట్రీ ఫామ్స్‌ను సీజ్ చేసి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు స్వామి, నర్సింలు, బాలయ్య, యాదయ్య, దేవయ్య పాల్గొన్నారు.

◆ **వారోత్సవాలను జయప్రదం చేయండి**

చేర్యాల(సిద్దిపేట): సీపీఐ శత వారోత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని వీరన్నపేటలో జరిగిన సీపీఐ, ఏఐటీయూసీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వందేండ్ల చరిత్ర కలిగిన సీపీఐ శత జయంతి వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 25న స్థానిక గాంధీ చౌరస్తా నుంచి అంగడి బజార్ వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం షాదీఖానలో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్, జనగామ జిల్లా కార్యదర్శి సీహెచ్.రాజారెడ్డి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు భూమయ్య, మహేందర్, వెంకటేశ్, లింగం, నరేశ్, బాబు, తదితరులు పాల్గొన్నారు.